క్లుప్తంగా

'ఇందిరా మహిళా శక్తి'కి తరలిన మహిళలు



తుక్కుగూడ నుంచి తరలివెళ్తున్న మహిళలు

తుక్కుగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో మహిళలు శనివారం తరలివెళ్లారు. మహిళలకు అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, వార్డు అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మహిళలకు మొక్కలను పంపిణీ చేస్తున్న రాజు

పహాడీషరీఫ్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు గనాతే రాజు ఆధ్వర్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాలనీలోని భారతమాత విగ్రహం వద్ద పూజలు నిర్వహించి మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఎక్కడైతే మహిళలు గౌరవించబడుతారో అక్కడే దేవతలు పూజింపబడుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు సత్యదేవి, లక్ష్మి, వసంత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



రమేశ్‌కు నగదు అందజేస్తున్న శ్రీనివాస్

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి తనవంతుగా ఆర్థిక సాయం అందించి అండగా ఉంటానని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన కాసుల రమేశ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శ్రీనివాస్ అతనిని పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: పల్లవి మోడల్ స్కూల్ తిరుమలగిరిలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా యూకేజీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే సంబురాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా సీఎస్ రాధా, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

చేవెళ్ల: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప పడిపూజ ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో అయ్యప్ప మాలధరించిన స్వాములు ఈ పడిపూజ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ముందుగా గణపతి, సుబ్రహ్మణ్యం, మాలిక పురోత్తమ్మ, మంజుమాత, నాగరాజు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పడిపూజ కార్యక్రమాన్ని చేపట్టి పడిని ముట్టించారు. అయ్యప్ప నామస్మరణతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. పూజారి కిరణ్ ఆధ్వర్యంలో ఈ పడిపూజ ఘనంగా జరిగింది. మనికాంత్‌రెడ్డి, సుమంగల్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, తిరుపతిరెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో?

- రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- తరుచూ ప్రమాదాలకు గురవుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



తుక్కుగూడ శ్రీశైలం జాతీయ రహదారిపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో స్థానికులకు ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. మున్సిపాలిటీ పరిధిలో వందకుపైగా పరిశ్రమలు ఉండటంతో జనాభా సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది. అదేవిధంగా శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రోడ్లపై ట్రాఫిక్ పెరగడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. జాతీయ రహదారిపై వేగ నియంత్రణ, సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు దాటాలంటే ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు వాహనదారులు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడే అక్రమంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత ఎక్కువవుతోంది.

రద్దీగా రోడ్లు..

శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ రోజురోజుకు పెరుగుతోంది. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి శ్రీశైలం వరకు పోవడంతో శ్రీశైలం మల్లన్న దైవ దర్శనం కోసం, శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, వండర్‌లా వినోద కేంద్రం, ఫ్యాబ్‌సిటీ, హర్డువేరు పార్క్, మంఖాల పారిశ్రామిక వాడ, నూతన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం అనేక రకాల వసతులు ఉండటంతో ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికంగా ఉన్న పరిశ్రమలో పని చేసే కార్మికులను తీసుకెళ్లడానికి వచ్చే కంపెనీల వాహనాలు రోడ్డుపై గంటల తరబడి ఉండటంతో సమస్య మరింత పెరుగుతోంది.

నడిరోడ్డు పై పార్కింగ్...

శ్రీశైలం జాతీయ రహదారి ఒకవైపు 25 ఫీట్లు, మరో వైపు 25 ఫీట్ల విస్తరణ కలిగి ఉంది. పుర కేంద్రంలో సర్దార్‌నగర్ గేటు నుండి మహేశ్వరం గేటు వరకు రెండు కిలో మీటర్ల దూరం మేరకు వ్యాపార వాణిజ్య సంస్థలు ఉన్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు తమ వాహనాలను 25 ఫీట్ల రోడ్డులో 10 ఫీట్ల మేరకు నడిరోడ్డు పై అక్రమంగా పార్క్ చేస్తున్నారు.దీంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. హోటల్స్, వైన్స్‌షాపులు, పుర కార్యాలయం ముందు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఇలా అక్రమ పార్కింగ్ మూలంగా జాతీయ రహదారి పై నిత్యం ప్రమాదాలు జరిగి, చాలా మంది మరణిస్తున్నారు.

ఔటర్ సర్వీస్ రోడ్డులో..

పుర కేంద్రంలో ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ -14 ఉంది. ఈ ఔటర్ ఎగ్జిట్ వద్ద ఔటర్‌పైకి వచ్చి, పోయే వాహనాలు అక్రమంగా సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ పెద్ద, పెద్ద కంటైనర్ వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ఇప్పటికైనా ట్రాఫిక్ అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి, జాతీయ రహదారి, ఔటర్ రింగు సర్వీస్ రోడ్డులో అక్రమంగా పార్కింగ్‌లో వాహనాలు ఉండక చూసి, ప్రమాదాలను నివారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి

పుర కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ చాలా పెరిగింది. దీనికి తోడు రోడ్డుపై అక్రమంగా పార్కింగ్‌తో రోడ్డు వాహనాలతో నిండిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి.

-బి అన్వేష్ మంఖాల్

సిగ్నల్ ఏర్పాటు చేయాలి

పుర కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఉదయం కంపెనీల వాహనాలు, ప్రజల వాహనాలు రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ సమస్య వస్తోంది. ట్రాఫిక్ అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌ను అరికట్టి ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి.

– సురేష్, రావిర్యాల



డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

లయన్స్ జిల్లా గవర్నర్‌గా మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు: 320ఏ లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్‌గా కందుకూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ 320ఏ జిల్లా వార్షికోత్సవంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు, ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ ఆర్.సునీల్‌కుమార్, మల్టీపుల్ చైర్మన్ రాజిరెడ్డి, ప్రస్తుత జిల్లా గవర్నర్ డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానించారు. 2007–08లో కందుకూరులో నూతనంగా లయన్స్‌క్లబ్ స్థాపించి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి అంచలంచెలుగా ఎదుగుతూ క్లబ్ ద్వారా సమాజంలో వివిధ రకాల సేవలు, వైద్య, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కాగా నూతనంగా ఎన్నికైన జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు నిజాం పాలనలోని కర్ణాటక ప్రాంతం పరిధిలోని 90 క్లబ్బులకు ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి గవర్నర్‌గా ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. 18 ఏళ్లుగా కందుకూరు సభ్యులు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, క్లబ్ అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి, కార్యదర్శి టి.జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటేశ్వర్లుగుప్తా, మాజీ అధ్యక్షులు ఎస్.వెంకటరంగారెడ్డి, బీఆర్ రాంరెడ్డి, జి.అమరేందర్‌రెడ్డి, జి.చెన్నకిషన్‌రెడ్డి, జి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ రోడ్డును అభివృద్ధి చేయాలి

కొత్తూరు: మండల కేంద్రం నుంచి కస్తుర్బాగాంధీ బాలికల హాస్టల్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షకీల్ శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. హాస్టల్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో రాకపోకల సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా రోడ్డుకిరువైపులా లైట్లు లేని కారణంగా రాత్రిళ్లు చీకట్లు అలుముకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి కేజీబీవీ రోడ్డును అభివృద్ధి చేసి, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని కోరారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు



రోడ్లను పరిశీలిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: వాటర్ పైపులైన్‌ల కోసం ప్రధాన రోడ్లను రెండేళ్ల క్రితం తవ్వి ఇప్పటిదాకా మరమ్మతులు చేయకుండా వదిలేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి కార్పొరేషన్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. గుంతల రోడ్లను నవారు మల్లారెడ్డి కాలనీవాసులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ అల్మాస్‌గూడ శివాలయం నుంచి శ్రీశ్రీ హోమ్స్ వరకు అలాగే విశాఖనగర్ నుంచి జయశంకర్ కాలనీ వరకు చక్కగా ఉన్న రోడ్లు మెట్రో వాటర్ పైపులైన్‌ల కోసం తవ్వి రెండేళ్లుగా రోడ్డు వేయకుండా గాలికి వదిలివేయడంతో రోజురోజుకు గుంతలు పెరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుమ్ము, దూళీతో కాలనీవాసులు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా కాలనీవాసులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కమిషనర్ పట్టించుకొని రోడ్డు పనులు మొదలుపెట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ చిగురింత పారిజాత విచ్చేసి కేక్ కట్‌చేసి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాన్ని, ప్రపంచాన్నే ఏలుతున్నారని గుర్తుచేశారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉచిత బస్ ప్రయాణం అందిస్తున్నారన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆమె మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో అమృత, పద్మశ్రీ, సుగుణ, సునీత, కవిత, పద్మావతి, ఇతర మహిళలు ఉన్నారు.

వ్యాపారులకు సన్మానం

హుడాకాంప్లెక్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ సంఘం (తపస్) మహిళా ప్రతినిధి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు కళావతి శనివారం కొత్తపేట ప్రధాన రహదారి వెంట పండ్లు, కూరగాయలు విక్రయించే చిరు మహిళా వ్యాపారులను శాలువాతో సత్కరించారు. అరుగాలం శ్రమించి, సమాజంలో కనీస గుర్తింపు నోచుకోని మహిళలను అభినందించారు. అనంతరం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



బడంగ్‌పేట్: వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మీర్‌పేటలో..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత ఆధ్వర్యంలో శనివారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మేకల విజయలక్ష్మి, దోమలపల్లి ధనలక్ష్మి, సిద్దాల పద్మ, ఏనుగుల అనిల్‌యాదవ్, రజాక్, లలిత, నిర్మల, మాధవి, లత, గీత, బిందు, ప్రమీద, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలి

మీర్‌పేట: బాధ్యతగా ఉంటూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే.నాగరాజు మహిళా సిబ్బందికి సూచించారు. శనివారం స్టేషన్‌లోని మహిళా పోలీసు సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఐ గౌరునాయుడు, ఎస్‌ఐలు కే.సుధాకర్, జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సారంగపాణి, ఎం.రాజశేఖర్, సిహెచ్.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: చిరువ్యాపారిని సత్కరిస్తున్న కళావతి



మీర్‌పేట: వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు, స్థానిక మహిళా నాయకురాళ్లు



మీర్‌పేట: మహిళా సిబ్బందితో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్‌ఐలు



శివకు నియామకపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

నియామకం

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నడికూడ శివ నియమితులయ్యారు. శనివారం మండల పరిధిలోని తుక్కుగూడలోని కేఎల్లార్ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు శివకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నడికూడ శివ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ నిరంతరం పనిచేస్తోందన్నారు. మండలంలో ఉన్న పరిశ్రమలు, కంపెనీలు, కర్మాగారాల్లో పని చేస్తున్న కార్మికుల హక్కుల కోసం తాను నిరంతరం పోరాడుతానని తెలిపారు. పనిచేస్తున్న ప్రతీ కార్మికుడికి కనీస వేతనం, ప్రభుత్వ అలవెన్సులు అందేవిధంగా కృషి చేస్తానన్నారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ నాయకత్వంలో పనిచేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా.సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సేనావత్ రాజునాయక్, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటం

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పున్నయ్య

షాద్‌నగర్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని నిర్వహిస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. శనివారం పట్టణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బసవ పున్నయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మహిళా జర్నలిస్టులకు రాత్రివేళల్లో ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. సమస్యలు, డిమాండ్ల సాధనకు అందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నరేశ్, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, లక్ష్మణ్, శ్రీను, లక్ష్మణ్, భరత్, మధుసూదన్, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!



కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

కొత్తూరు: కంచెలు లేని, రోడ్లు, ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రజలు, మూగ జీవాలు బలవుతున్నాయి. అయినప్పటికీ స్థానిక ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయడం లేదు. మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ప్రధాన కూడలీ వద్ద ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె చాలా కిందకు ఉంది. మూగ జీవాలు, ప్రజలు గమనించకుండా సమీపం నుంచి వెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఎత్తు పెంచడంతో పాటు కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎంఈఓ మనోహర్ ఆకాంక్షించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రసూల్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ఏదైనా సాధించాలనే కృషి పట్టుదల ఉంటే విజయతీరాలకు చేరుకుంటారన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని లక్ష్య సాధనకు నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి, భయాందోళనకు గురికాకుండా సంసిద్ధులు కావాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ పండుగ బాల్‌రాజ్, అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సుశీల, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, ప్రియాంక, శివశంకర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.